సాక్షి
విజయనగరం
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



ఒక్క హామీతో... మారిన జీవన రేఖ

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి కుటుంబాల్లో ఉద్యోగ వెలుగులు నింపింది. - 8లో



ఉత్సాహంగా ఉరుసు ఉత్సవం

విజయనగరం ఆధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహీన్ షా బాబా ఖాదర్ వలీ 65వ మహా సూఫీ సుగంధ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. - 8లో



అదుపు తప్పిన స్కూల్ బస్సు

నవ్వుతూ..తుళ్లుతూ ఇంటికి బయల్దేరిన చిన్నారుల్లో ఒక్కసారి అలజడి రేగింది. స్కూల్ బస్సు ప్రమాదానికి గురికావడంతో భయాందోళన చెందారు. - 8లో

న్యూస్‌రీల్

కంప్యూటర్ సైన్స్ ట్రైనర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- 23న ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూ

విజయనగరం అర్బన్: డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ కళాశాల (స్కిల్ హబ్) ప్రిన్సిపాల్ టి.వి.గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని వి.టి.అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల స్కిల్ హబ్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. కంప్యూటర్ సైన్ డిగ్రీ, ఆపై చదువుకున్న 30 నుంచి 45 ఏళ్లలోపు వయసు ఉన్న అభ్యర్థులు ఈ నెల 23న ఉదయం ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ఇంటర్వ్యూకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్: 80745 95942, 77806 58035 నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ముందుగా ఈఆర్‌ఓ స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకుని తుది జాబితాను తయారు చేయాలని సూచించారు. కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి, ఉన్న వాటిని రద్దు చేయడానికి అవకాశం లేదని, కేవలం ఒకే ప్రాంగణంలో ఉండి వేరే భవనంలోకి మార్చడానికి మాత్రమే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ తన చాంబర్‌లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల ఖరారు, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై వారికి చర్చించారు. ఎన్నికల ప్రచారానికి బాలబాలికలను ఎట్టి పరిస్థితిల్లోనూ వినియోగించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసి, జాబితాను మార్చి 5వ తేదీలోగా పంపించాలని కోరారు. జిల్లా ఓటర్ల జాబితాలో పెద్దగా మార్పులు లేవని, ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే ముమ్మరం చేస్తామని చెప్పారు. ముఖ్యంగా యువ ఓటర్లపై దృష్టి పెట్టి చైతన్యవంతం చేస్తామన్నారు. సున్నిత ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి అక్కడి ప్రజల్లో ధైర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. లక్ష్మీపురం, మల్యాడ, ముంజేరు తదితర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, కుటుంబరావు, సోములు, ఈఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా



గుమ్మలక్ష్మీపురంలోని గోదాంలో నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ ఎస్.సుబ్బరాజు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డు లబ్ధిదారులకు పౌరసరఫరాల ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నట్టు విశాఖపట్నం సివిల్ సప్లై కార్పొరేషన్ జోనల్ మేనేజర్ ఎస్.సుబ్బరాజు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం జీసీసీ మెయిన్ గోదాం (ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్)ను బుధవారం పరిశీలించారు. నిత్యావసర సరుకుల నిల్వలు, రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట గొదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

ట్రైఫెడ్‌తో కలిసి మార్కెటింగ్



వీడీవీకే సభ్యులతో మాట్లాడుతున్న ఎం.డి. సురేష్‌కుమార్

సీతంపేట: గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా ట్రైఫెడ్‌తో కలిసి మార్కెటింగ్ చేస్తామని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని పులిగుమ్మి వీడీవీకేలో కొండచీపుర్ల యూనిట్‌ను బుధవారం పరిశీలించారు. సంఘ సభ్యులతో మాట్లాడారు. రోజుకు ఎన్నియూనిట్లు తయారు చేస్తున్నారు.. ఎన్ని మార్కెటింగ్ చేశారు.. ఆదాయం ఎంత వచ్చింది.. తదితర వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రోసి రెడ్డి, జీసీసీ డి.ఎం.సంధ్యారాణి, బ్రాంచ్ మేనేజర్ దాసరి కృష్ణ పాల్గొన్నారు.

వెనుకబాటు నుంచి అభివృద్ధి వైపు..

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనపై ప్రశంసల జల్లు కురిసింది. ఇదే పాలన మళ్లీ కావాలన్న నినాదం గట్టిగా వినిపించింది. కేవలం 57 నెలల్లోనే ఉమ్మడి విజయనగరం జిల్లా వెనుకబాటు నుంచి అభివృద్ధివైపు పయనించిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్, రెండు మెడికల్ కళాశాలలు, గిరిజన వర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ జీవీ వర్సిటీ, సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ, రోడ్ల నిర్మాణం, ఊరూరా ప్రభుత్వ భవనాల నిర్మాణంతో జిల్లా ముఖచిత్రమే మారిపోయిందని ప్రజా సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు, రాజకీయనాయకులు, విద్యార్థులు, మహిళలు పేర్కొన్నారు. ప్రతిఇంటా 'నవరత్న'వికాసం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అవినీతి రహిత పాలన అందుతోందని, పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు కనిపిస్తున్నాయన్నది 'సాక్షి'టీవీ చానల్ ఆధ్వర్యంలో కేఎస్‌ఆర్ లైవ్‌షో వ్యాఖ్యాత, ప్రముఖ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, యాంకర్ ఈశ్వర్ సమక్షంలో విజయనగరంలోని గురజాడ కళాక్షేత్రం వేదికగా సాగిన 'ప్రజాప్రస్థానం' చర్చావేదికలో సుస్పష్టమైంది.

– విజయనగరం ఫోర్ట్/విజయనగరం అర్బన్

- ప్రగతి పథంలో ఉమ్మడి విజయనగరం జిల్లా
- పేదకుటుంబాల విద్యార్థుల్లో చదువు వికాసం
- ప్రతిఇంటా 'నవరత్న' వెలుగులు
- జిల్లా అభివృద్ధికి బాసటగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం
- ప్రభుత్వ చర్యలతో ప్రజలకు ఆరోగ్య భరోసా
- వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి దిశగా చర్యలు
- ప్రజాప్రస్థానం చర్చావేదికలో జిల్లాకు కలిగిన మేలును వివరించిన వక్తలు



ప్రజాప్రస్థానం చర్చా వేదికలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, యాంకర్ ఈశ్వర్

ప్రజా ప్రస్థానం


గొప్ప సంకల్పం ఉన్న వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి



చెప్పేది చేసే గొప్ప సంకల్పం ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం చేసి మూడు రాజధానులు ప్రకటించారు. విశాఖను పరిపాలన రాజధానిగా కాకుండా ఆపే శక్తి భవిష్యత్తులో ఉండదు. భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న నాలుగు పట్టణాల్లో విశాఖ ఒకటి. పరిపాలన వికేంద్రీకరణతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

– లజపతిరాయ్, ఉత్తరాంధ్ర వేదిక కన్వీనర్, మాజీ వైస్ చాన్సలర్

మంచి జరిగితేనే ఓటు వేయండని చెప్పిన వ్యక్తి జగన్



మంచి జరిగితేనే ఓటు వేయండని చెబుతున్న దమ్మున్న వ్యక్తి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు దోచుకుతున్నాయి. ప్రతి పథకానికి లంచం ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడు అర్హతే కొలమానంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. పారదర్శకత పెరిగింది.

– కడియం రామకృష్ణ, కార్పొరేటర్, విజయనగరం

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు–నేడు కింద ఆధునిక సొబగులు అద్దారు. చదువులకు ఆలవాలంగా సర్కారు బడులను తీర్చిదిద్దారు. దీనివల్లే పలు పాఠశాలల వద్ద సీట్లు ఫుల్ అన్న బోర్డులు కనిపిస్తున్నాయి. రామోజీరావు రాచరికపు పోకడలతో పేద పిల్లల చదువులపై విషపు రాతలు రాస్తున్నాడు. తన మనమడు మాత్రం ఇంగ్లిష్ మీడియంలో చదవొచ్చు. పేదపిల్లలు ఇంగ్లిష్ మాధ్యమంలో చదవకూడదనే అక్కసుతో ఉన్నాడు. విజయనగరం జిల్లాలో పంటల సాగుకు వర్షమే ఆధారం. దివంగత నేత వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులకు అండగా నిలిచారు. వలసలను తగ్గించారు. తండ్రికి తగ్గ తనయుడిగా జగన్‌మోహన్ రెడ్డి పెట్టుబడి సాయంతో పాటు విత్తనం నుంచి పంటకొనుగోలు వరకు ఆర్‌బీకేల ద్వారా సాగుసేవలందిస్తున్నారు. పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

అవినీతి రహిత పాలన



దేశంలో అవినీతి రహిత పాలన అందించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి. సంక్షేమ పథకాల ఆర్థిక ప్రయోజానాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమచేస్తున్నారు. తాగునీరు కూడా దొరకని ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని తలపెట్టింది. విశాఖను కార్యనిర్వాహక రాజధాని చేస్తే పెట్టుబడుదారులు వస్తారని జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేశారు. విశాఖపట్నం ఆసియాలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతోన్న జిల్లా. రాష్ట్రంలోనే పెద్ద నగరంగా విశాఖ తయారువుతుంది. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఉత్తరాంధ్రలో చెప్పుకోదగ్గ ఒక్క కార్యక్రమం చేయలేదు. 1979లో ఏర్పాటైన విజయనగరం జిల్లా ప్రజల ఆరోగ్య భరోసా కోసం ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదే. జేఎన్‌టీయూ వర్సిటీ, గిరిజన వర్సిటీ, కురుపాంలో ఇంజినీరింగ్ కళాశాల వంటివికి సమకూరాయి. అందుకే ఆయనకు ప్రజల అండదండలు పుష్కలంగా ఉన్నాయి.

– కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ స్పీకర్



కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయనాయకులు, ప్రజాసంఘాల సభ్యులు, విద్యార్థులు, మహిళలు

సచివాలయ వ్యవస్థ సూపర్



సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. చక్కని వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. వైద్యకళాశాల ఏర్పాటుచేసి జిల్లా ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పించారు. జిల్లాలో కేన్సర్ రోగులు ఎక్కువగా ఉన్నందున కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఊహించని స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్య రంగంలో మార్పులు వచ్చాయి. శిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. ఉత్తరాంధ్రలోని హెచ్ఐవీ బాధితులకు దీర్ఘకాలిక పింఛన్లు అందజేయాలి.

– బీశెట్టి బాబ్జి, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు

దేశం చూపు ఏపీ వైపు



ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించింది. గతంలో కనీసం మరుగుదొడ్లు కూడా ఉండేవి కావు. చెట్టుగట్లు చాటుకు పరుగతీయాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఏ బడిని చూసినా వాష్ రూమ్‌లు, క్లాస్ రూమ్‌లు కార్పొరేట్ పాఠశాలలు కంటే మిన్నగా ఉన్నాయి. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వబడులు బలోపేతమయ్యాయి. ఆంగ్ల విద్య అందుబాటులోకి వచ్చింది. అందుకే.. మా పిల్లలను ప్రైవేటు స్కూల్‌లో మాన్పించి కస్పా హైస్కూల్‌లో చేర్పించాను. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సూర్యుడితో సమానం. దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్నారు.

– అల్లం ఉదయలక్ష్మి, విజయనగరం

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా..



గతంలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు పెచ్చులూడిపోయి శిథిలావస్థ స్థితిలో ఉండేవి. నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దింది. చీపురపల్లి ప్రాంతంలో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. వరి పండేది కాదు. తిండిగింజలను ఏటా కొనుగోలు చేయాల్సిందే. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో తోటపల్లి కాలువను ఆధునీకరించారు. సాగునీరు అందడంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. గతంలో సీహెచ్‌సీల్లో ఒకరు, ఇద్దరు వైద్యులు మాత్రమే ఉండేవారు. గర్భిణులను ప్రసవం కోసం ఘోష ఆస్పత్రికి రిఫర్ చేసేవారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కో సీహెచ్‌సీలో 6, 7 మంది వైద్యులను నియమించారు. అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయి. భోగాపురం ఎయిర్ పోర్టుకు చంద్రబాబు ప్రభుత్వం శంకుస్థాపన చేసి ఐదేళ్లు కాలయాపన చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి కృషితో నేడు చకచకా నిర్మితమవుతోంది. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు నానాపాట్లు పడేవారు. నేడు ఊరిలోని రైతుభరోసా కేంద్రంలోనే సమకూరుతున్నాయి.

– బెల్లాన చంద్రశేఖర్, పార్లమెంట్ సభ్యులు

మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించినది జగనన్నే..



దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో మాత్రమే మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిదే. తెలుగు దేశం పార్టీలో మహిళలకు ప్రాధాన్యంలేదు. అందుకే ఆ పార్టీ నుంచి ఎంతో మంది మహిళా నేతలు పార్టీని వీడారు. పేద విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో విద్యారంగంలో అనేక మార్పులను తీసుకొచ్చారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో పేదకుటుంబాల విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తున్నారు.

– కోలగట్ల శ్రావణి, డిప్యూటీ మేయర్

రాయితీలు పెరిగాయి



కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల కృషితో ప్రజలకు రాయితీలు అందుతున్నాయి. సంక్షేమ పథకాలు చేరువయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చెందాయి.

– రవివర్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

నాడు రాదన్న కళాశాల నేడు వచ్చింది..



గత టీడీపీ ప్రభుత్వం జిల్లాకు వైద్య కళాశాల ఏర్పాటు చేయలేమని తేల్చిచెప్పింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాల ఏర్పాటు చేసి జిల్లా ప్రజల ఆశలను నేరవేర్చారు. సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే పేదలకు మేలు జరుగుతుంది. వైద్య సేవలు మెరుగుపడ్డాయి.

– ఆశ, విజయనగరం

న్యాయం జరిగింది



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి హయాంలో న్యాయం జరిగింది. రాష్ట్ర పునర్వ విభజన చట్టాన్ని అమలు చేయడంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్ర విభజన సమయంలో బీజేపీ, టీడీపీ రెండు నాల్కుల ధోరణిని అవలంబించాయి. జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యం దక్కింది. అధికార వికేంద్ర కరణతో వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి.

– బి.భానుమూర్తి, విజయనగరం

వసతులు పెరిగాయి



సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు పెరిగాయి. గతంలో ఓపీల్లో నిరీక్షించలేక రోగులు ఇబ్బంది పడేవారు. ఇప్పడు సిబ్బంది పెరగడం వల్ల సేవలు సకాలంలో అందుతున్నాయి. ప్రతిరోజు ఒక కలర్ బెడసీట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు 2, 3 సార్లు మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేసే లాప్రోస్కోపిక్ సర్జరీలు ఘోష ఆస్పత్రిలో చేస్తున్నారు.

– శైలజ, వైద్య ఉద్యోగి, విజయనగరం

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం



ప్రపంచంతో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధనను ప్రభుత్వం చేరువచేసింది. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు చదువుకు ఉపయోగపడుతున్నాయి. జగనన్న గోరుముద్ద కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోంది. గతంలో ఇంతటి పర్యవేక్షణ ఉండేదికాదు. నేడు జవాబుదారీ తనం పెరిగింది. వలంటీర్ వ్యవస్థతో ఇంటివద్దనే అర్హులకు పథకాలు అందుతున్నాయి. పాలనలో వేగం పెరిగింది. కోవిడ్ సమయంలో ప్రభుత్వ కృషి భేష్.

– సారిక సతీష్, లెక్చరర్, విజయనగరం

విజయనగరం అభివృద్ధి చెందింది



విజయనగరం గతంలో కంటే చాలా అభివృద్ధి చెందింది. గతంలో తాగడానికి కూడా నీళ్లు దొరికేవికావు. ఇప్పుడు తాగునీటి ఇబ్బంది తీరింది. విజయనగరంలో మొట్టమొదటిసారిగా మహిళా పార్కును ఏర్పాటు చేశారు. ప్రతి కూడలిని అందంగా తీర్చిదిద్దారు.

– ఉషారాణి, విజయనగరం

గురువుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు



పాల్గొన్న ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు

విజయనగరం అర్బన్: పిల్లల బంగారు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పిల్లలు పాఠశాలలకు హాజరుకాని రోజున వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. యుక్తవయసు పిల్లలపై అటు తల్లిదండ్రులు ఇటు ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన పరీక్షా పే చర్చలో భాగంగా బుధవారం పరీక్షాపర్వ్–6.0 కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అప్పారావు మాట్లాడుతూ పెరిగిన సాంకేతికతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ఇందులో బాలలే ఎక్కువగా బలవుతున్నారని వాపోయారు. దీనిపై విద్యార్థులు అప్రమత్తం చేయాలన్నారు.

- జాతీయ బాలల హక్కుల కమిషన్ సాత్ కో ఆర్డినేటర్ చిట్టిబాబు మాట్లాడుతూ పరీక్షలు పండగ వంటివని, పండగకు వారం ముందే ఎలా అలంకరణతో ఉల్లాసంగా ఉంటామో పరీక్షలకు కూడా అలాగే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధానిమోదీ రచించిన ఎగ్జామ్ వారియర్ పుస్తకంలో 'విద్యార్థి వారియర్‌గా ఉండాలని వర్రియర్‌గా కాకూడదని' రాసారని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పుస్తకంలోని అంశాలను వివరించారు. పుస్తకంలోని 34 సూచననలను విద్యార్థులకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏపీలోని ఆరు జిల్లాల్లో పరీక్షా పే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఉత్తరాంధ్రలో విజయనగరం, విశాఖపట్నం, పాడేరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.
- డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు మాట్లాడుతూ విద్యార్థిలోని ప్రతిభ ఉపాధ్యాయునికే ముందు తెలుస్తుందన్నారు. ఆయా రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. మార్కులు ప్రధానం కాదని, అంతకన్నా ప్రవర్తన ముఖ్యమని అన్నారు.
- డీఈఓ ఎన్.ప్రేమకుమార్ మాట్లాడుతూ తరగతి గదిలో పిల్లల్ని పిలిచే పిలుపు కూడా ఆప్యాయంగా ఉండాలని, రంగు, రూపులను బట్టి నిక్‌నేమ్స్ పెట్టకూడదన్నారు. విద్యార్థులను కించపరిచేలా ఉపాధ్యాయుల తీరు ఉండకూడదన్నారు. పరీక్షలు ఒత్తిడి నుంచి బయటకు రావడానికి ప్రతిరోజు చదివించాలని, మొదట్లో కష్టంగా అన్పించినా తర్వాత చదువు వారి జీవన విధానంలో భాగంగా మారిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమార్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిపాజిట్ల పేరుతో టోకరా

- రూ.కోటీ 30 లక్షలు వసూలు చేసిన టీడీపీ నాయకుడు
- పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు



డిపాజిట్ బాండ్లను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

బొబ్బిలి: మన ఊరివాడే కదా..మనకు బాగా తెలిసిన వాడే కదా అని వారంతా నమ్మారు. కష్టపడి సంపాదించిన సొమ్ము పిల్లల భవిష్యత్తు కోసం పనికొస్తుందని ఆశించి గ్రామస్తుడి దగ్గర డిపాజిట్ చేశారు. డిపాజిట్లు వసూలు చేసిన ఆ వ్యక్తి ఏడాది కిందట బోర్డు తిప్పేయడంతో తమ సంగతేంటని నిలదీయగా ఇచ్చేస్తానని డిపాజిట్ దారులకు నమ్మబలుకుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. చివరికి తాము మోసపోయామని గ్రహించిన డిపాజిట్ దారులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులే తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. బొబ్బిలి మండలంలోని కొండదేవుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు డిపాజిట్ల పేరుతో సుమారు రూ.1 కోటి 30 లక్షలు వసూలు చేసి బోర్డు తిప్పేసి టోకరా పెట్టిన వ్యవహారమిది. ఈ సంఘటనపై బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బొంగు పరిశినాయుడు లోకిత్ భార్టీ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ సంస్థ పేరున డిపాజిట్లు కట్టించుకున్నాడు. మన గ్రామస్తుడే కదా అన్న నమ్మకంతో పదేళ్ల క్రితం ఆ గ్రామస్తులు రూ.50 వేల నుంచి రూ.6 లక్షల వరకు డిపాజిట్ చేశారు. ఐదేళ్లలో మీ సొమ్ము రెట్టింపవుతుందని కొంతమంది ఏజెంట్ల ద్వారా నమ్మించి కట్టించుకున్నాడు. దాదాపు ఏడాది కిందట ఆ సొసైటీని ఎత్తివేయడంతో మా డిపాజిట్ల పరిస్థితి ఏమిటని బాధితులు నిలదీయగా ఆ గ్రామసర్పంచ్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. బాధితులు మోసపోయామని వాపోతూ బుధవారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బొమ్మరిల్లి ఆదమ్మ, నొట్టి రమ, బంటుపల్లి రాము, ఓదెల ప్రసాద్, బొలపరెడ్డి ప్రసాద్, నొట్టి రేణుక, బేత గౌరి, బొలపరెడ్డి రమణ తదితరులు పోలీసులను ఆశ్రయించిన వారిలో ఉన్నారు.

క్లుప్తంగా

తప్పిన పెను ప్రమాదం

భోగాపురం: మండల కేంద్రంలోని సిరిగుడి వారి కళ్లాల వద్ద నివాసముంటున్న సిరుగుడు కాసులమ్మ ఇంట్లో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

తూర్పుకాపు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రాంబాబు


రాంబాబును అభినందిస్తున్న దృశ్యం

రేగిడి: ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రేగిడి మండలంలోని కాగితాపల్లి గ్రామానికి చెందిన దూబ రాంబాబు ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. గ్రామస్తులతో పాటు బంధువులు, స్నేహితులు రాంబాబును అభినందించి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని తూర్పు కాపుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

యూత్‌గేమ్స్‌లో ఆదినారాయణకు కాంస్యం



నెలిమర్ల రూరల్: ఈ నెల 19 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ యూత్ గేమ్స్–2023 పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ బట్టు ఆదినారాయణ కాంస్య పతకం సాధించాడు. 81 కేజీల విభాగంలో బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ఆదినారాయణ స్నాచ్ 135 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 160 కిలోలు..మొత్తంగా 295 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ప్రతిభ కనబరిచిన వెయిట్ లిఫ్టర్‌కు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ సన్యాశినాయుడు, కోచ్‌లు అర్జున్, మత్స సంతోషి అభినందనలు తెలిపారు.


ఉమ్మడి విజయనగరం జిల్లాలో పాదయాత్రకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన 1998 డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)


ఆనందం వ్యక్తం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

- పాతికేళ్ల నిరీక్షణకు ఊపిరి పోసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఆశ వదులుకున్న ఉద్యోగాలు రావడంతో ఆనందంలో 1998 డీఎస్సీ అభ్యర్థులు
- ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 739 మందికి పోస్టులు

ఒక్క హామీతో... మారిన జీవన రేఖ

వీరఘట్టం: మీకు నేనున్నానంటూ భరోసా ఇచ్చేందుకు అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర నేడు ఎందరో జీవితాల్లో వెలుగులు నింపింది. ముఖ్యంగా పాదయాత్ర సమయంలో 1998 డీఎస్సీ అభ్యర్థులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ..నేడు రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు దారి చూపింది. కలగా మిగిలిన ఉపాధ్యాయ పోస్టులు పాతికేళ్ల తర్వాత తమకు చేతికి రావడంతో 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 1998 డీఎస్సీ అభ్యర్థుల జీవితాలకు బంగారుబాట వేయడంతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 739 మంది ఉపాధ్యాయ పోస్టులను సొంతం చేసుకున్నారు.

ఇదీ పోస్టు నేపథ్యం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1998లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులకు కటాఫ్ మార్కులు నిర్ణయించి రిజర్వేషన్లను కేటాయించింది. అందులో ఓసీలకు 50, బీసీలకు 45, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 మార్కులుగా నిర్ణయించారు. ఆ మేరకు అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూలకు పిలిచారు. దీనికి సంబంధించి అప్పట్లో 221 జీఓ జారీచేశారు. కొన్ని విభాగాల్లో కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులు లేకపోవడంతో మరో జీఓ 618ను విడుదల చేసి కటాఫ్ మార్కులను 45, 40, 35గా నిర్ణయించారు. అదే సమయంలో ఉమ్మడి ఏపీలో ఉపఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ చాలా జిల్లాల్లో జరగలేదు. ఎన్నికలు పూర్తయిన తర్వాత జిల్లాలో 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచారు. రెండు జీఓల ప్రకారం అభ్యర్థులు హాజరయ్యారు. మొదటి జీఓ ప్రకారం ఎక్కువ కటాఫ్ మార్కులు వచ్చిన చాలామంది ఉద్యోగానికి అర్హత సాధించలేకపోయారు. అంతకు ముందు డీఎస్సీల్లో మిగిలిపోయిన వారికి రోస్టర్, సీనియార్టీ ప్రకారం ఖాళీ అయిన పోస్టులను కేటాయించేవారు. కానీ ఇక్కడ అలా జరగలేదు. దాంతో వారంతా ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దాదాపు 11 ఏళ్ల పాటు విచారణ అనంతరం నష్టపోయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని తీర్పు వచ్చింది. 2011లో హైకోర్టులో కూడా విచారణ జరిగాక ట్రిబ్యునల్ తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. అయినా వారికి అప్పటి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా వారికి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా వంచన చేసింది.

మాటకు కట్టుబడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..

1998 డీఎస్సీ అభ్యర్థులకు అనుకూలంగా కోర్టులు తీర్పులు ఇచ్చినప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం తన పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి 1998 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 2022 జూన్ 14న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫైల్‌పై సంతకం చేసి ఉద్యోగాలు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అలా నియామకాలు పొందిన వారికి మినిమం టైమ్ స్కేల్ కింద నెలకు రూ.34 వేలు వేతనం చెల్లిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారు.

సీఎం రుణం తీర్చుకోలేం



పాతికేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూశా. మాకు ఉద్యోగాలు వస్తాయనే ఆశ వదులుకున్నాం. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది మా ఉద్యోగాలు మాకు ఇప్పించారు. నాకు ఉద్యోగం రావడంతో మా కుటుంబం మొత్తం ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేనిది.

వారణాసి నరసింగరావు, వీరఘట్టం

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



మాకు ఉద్యోగాలు ఇస్తామని గత ప్రభుత్వాలు ఎన్నో హామీలు ఇచ్చాయి. అయితే ఎవరూ మాగోడు పట్టించుకోలేదు. కాలంతో పాటు వయస్సు కూడా పెరుగుతుండడంతో ఇక ఉద్యోగాలు రావని నిరాశతో ఉన్న మాకు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ భరోసా ఇచ్చింది. ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. గతేడాది ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 739 మందికి ఉద్యోగాలు ఇచ్చి మా బతుకులకు దారి చూపించారు. ఆయన మేలు మరువలేం.

బి.ఉమాకామేశ్వరరావు, సాలూరు

వైఎస్సార్‌సీపీలో చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరుతున్నవారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: పట్టణంలోని కంచరాం జగనన్న కాలనీకి చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు పలువురు వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సమక్షంలో కాలనీలోని చింత సత్యనారాయణ, గంధవరపు సురేష్, కె.శ్రీనివాసరావు, కనుగుల ఇస్సాన్, రౌతు విజయ్‌కుమార్, తామాడ మణీశ్వరరావు, సీహెచ్.శంకర్, శ్రీనివాసరావు, ఎం. శ్రీను, ధనుంజయ్, మాటూరి హరి, శ్రీదేవి, చిక్కాల రాము తదితరులతో పాటు మరో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగనన్న ఇంటి పథకం ద్వారా కాలనీలో స్థలం, ఇల్లు రావడంతో పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా గ్రామ స్థాయిలో లభిస్తుండడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి అభిమానులుగా తామంతా మారిపోయామని చెప్పారు. కార్యక్రమంలో కంచరాం మాజీ ఎంపీటీసీ సామంతుల వెంకటప్పల నాయుడు, డాక్టర్ నాగేంద్ర, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి




లక్ష్మణరావు మృతదేహం (ఇన్‌సెట్లో) లక్ష్మణరావు(ఫైల్)

డెంకాడ: అంతవరకూ బాగానే ఉండి అందరినీ పలకరించిన ఆ యువకుడిని అంతలోనే గుర్తు తెలియని వాహనం మృత్యువై మింగేసి తల్లిదండ్రులు, సోదరికి తీరని శోకం మిగిల్చింది. పినతాడివాడ–గొడిపాలెం ఆర్‌అండ్‌బీ రహదారిపై పినతాడివాడ గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పినతాడివాడ నుంచి గొడిపాలెం వెళ్తున్న మోటార్‌సైకిల్‌ను పినతాడివాడ కళ్లాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావు(17) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అదే బైక్‌పై ఉన్న మరో యువకుడికి గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు ప్రమాద స్థలానికి చేరుకుని, పలు విభాగాలకు సమాచారం అందజేసి మృతుడి తల్లిదండ్రులను ఓదార్చారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు, కవల సోదరి రోదన

పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి రామారావు, కొండమ్మ దంపతులకు రమాదేవి, లక్ష్మణరావు ఇద్దరు కవల పిల్లలు. ఈ కవలల్లో లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో తమ్ముడు లక్ష్మణరావును తీసుకువెళ్లిపోయి తనను ఒంటరి చేశావా? భగవంతుడా అంటూ సోదరి రామలక్ష్మి భోరున విలపించింది. అలాగే కుటుంబానికి వారసుడైన కుమారుడిని తీసుకుపోయావా దేవుడా అంటూ తల్లిదండ్రుల రోదనతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది.

బ్రెయిన్ టీబీతో గిరిజన విద్యార్థిని...


బిడ్డిక శ్రుతి (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్(పీటీజీ)లో 7వ తరగతి చదువుతున్న బిడ్డిక శ్రుతి (12) బ్రెయిన్ టీబీ వ్యాధికి చికిత్స పొందుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో బుధవారం మృతిచెందింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రుతికి ఈనెల 11న జ్వరం రావడంతో భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్య సేవలందించామని, జ్వరం తగ్గకపోవడంతో ఈనెల 14న విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లి అడ్మిట్ చేశామన్నారు. అక్కడి వైద్యులు నిర్వహించిన తనిఖీల్లో బ్రెయిన్ టీబీ ఉందని, ఆ కారణంగా గుండె, కిడ్నీలు పాడయ్యాని నిర్ధారించి, చికిత్స ప్రారంభించారని తెలిపారు. మెరుగైన వైద్యసేవలందేలా ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పర్యవేక్షణ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. కురుపాం మండలంలోని ఉదయపురం పంచాయతీ రెల్లిగూడ గ్రామానికి చెందిన శ్రుతికి తల్లి కళావతి, తండ్రి సింగన్న ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి..

విజయనగరం క్రైమ్: పట్టణంలోని కణపాక మహంతివీధికి చెందిన మజ్జి గౌరునాయుడు (35) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బాలాజీ మార్కెట్ బట్టల షాపులో పనిచేస్తున్న గౌరునాయుడు పక్క ఇంట్లో నివాసం ఉంటున్న వారు తమ ఇంటికి విద్యుత్ రావడం లేదని మంగళవారం రాత్రి రాత్రి 8 గంటల సమయంలో పిలిచారు. దీంతో స్నేహితుడితో కలిసి ఆ ఇంటికి వెళ్లి చెక్ చేస్తున్న సమయంలో గౌరునాయుడికి విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారమివ్వడంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య రామాయమ్మ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఉరుసు ఉత్సవం

- తరలివచ్చిన భక్తజనం
- నగర పురవీధుల్లో సందడిగా బాబా సందల్
- లంగర్ ఖానాలో భక్తులకు దివ్య అన్నసమారాధన


బాబాను దర్శించుకుంటున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు


పురవీధుల్లో బాబా చిత్రపటంతో భారీ ఊరేగింపు

విజయనగరం టౌన్: విజయనగరం ఆధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహీన్ షా బాబా ఖాదర్ వలీ 65వ మహా సూఫీ సుగంధ మహోత్సవాలు రెండోరోజు బుధవారం అంగరంగ వైభవంగా, ఉత్సాహంగా జరిగాయి. ఉదయం పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనం నిర్వహించారు. విజయనగరం దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో అశేషంగా భక్తులు బాబాను దర్శించుకున్నారు. దర్బార్ నుంచి నగర పురవీధుల్లో వేలాదిమంది బాబా సందల్ తీసుకుని వెళ్లి పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరిగి దర్బార్‌కు తీసుకువచ్చి పూజలు చేశారు. ఉరుసులో ప్రధానమైన ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. ఫకీర్ మేళా ఖవ్వాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం లంగర్ ఖానాలో వేలాది మంది భక్తులకు దివ్య అన్నసమారాధన అర్ధరాత్రి వరకూ నిర్వహించారు. చీమలపాడు సూఫీ పీఠాధిపతి మహమ్మద్ ఖ్వాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి మాట్లాడుతూ సాటి మనిషిని ప్రేమతో చూడాలని, అదే భగవంతుడిని చేరుకునే సరళమైన మార్గమని విశ్వసమాజానికి పిలుపునిచ్చారు.

బాబాను దర్శించుకున్నవారిలో..

సూఫీ సుగంధ మహోత్సవాల్లో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులు బాబాను దర్శించుకున్నారు. అదేవిధంగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్.జాన్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలాడ ఆనందరావు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ స్వాదిక్, రియాజ్‌లు బాబాను దర్శించుకున్న వారిలో ఉన్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు బాబా దర్గాను దర్శించుకోగా దర్బార్ షరీఫ్ డాక్టర్ ఖలీల్‌బాబు వారికి స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు చేసి, ప్రసాదాలను అందజేశారు. కులమతాలకతీతంగా బాబా ఉరుసు ఉత్సవానికి భక్తజనం హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిల నారాయణరావు, సంపత్ ఖాదర్, మునిప్రవీణ్, ప్రశాంత్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం


అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయిన బస్సు


ప్రమాదం నుంచి బయటపడి బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు

శృంగవరపుకోట: నవ్వుతూ..తుళ్లుతూ ఇంటికి బయల్దేరిన చిన్నారుల స్కూల్ బస్సు ప్రమాదానికి గురవడంతో అంతా భయభ్రాంతులయ్యారు. దీంతో చిన్నారులంతా ఏడుస్తూ బిక్కుబిక్కు మంటూ తమవారి కోసం రోడ్డుపై నిల్చున్నారు. అయితే బస్సులో పిల్లలంతా ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట పట్టణంలోని రామన్ స్కూల్‌కు చెందిన బస్సు సుమారు 70మంది విద్యార్థులతో సాయంత్రం 5గంటల సమయంలో బయల్దేరింది. కొత్తూరు జంక్షన్ వరకూ వెళ్లిన బస్సు జంక్షన్‌లో రోడ్డుపై స్కూల్ పిల్లలతో ఉన్న ఆటోను ఢీకొట్టి, ఎడమవైపు ఖాళీగా ఉన్న పొలంలోకి ఒరిగిపోయింది. పిల్లల హాహాకారాలతో కొత్తూరు గ్రామస్తులు, రోడ్డున పోతున్న వారంతా హుటాహుటిన వచ్చి విద్యార్థులను బస్సు నుంచి కిందికి దింపారు. పిల్లలంతా క్షేమంగా ఉండడంతో స్కూల్ యాజమాన్యం, వారి తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళపై దూసుకుపోయిన బస్సు

కొత్తూరు వద్ద బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో ఎస్.కోట రైతుబజార్‌కు వెళ్లి వస్తున్న వెంకటరమణపేట గ్రామానికి చెందిన ఎండపల్లి వెంకటేశ్వరమ్మ ఉరఫ్ సత్యవతి పాసింజర్ ఆటో దిగింది. అదే సమయంలో వెనుకగా స్కూల్ పిల్లలతో వచ్చిన ఆటో ఆగింది. ఆ వెనుకనే వస్తున్న స్కూల్‌బస్ ముందున్న ఆటో ఒక్కసారిగా ఆగడంతో, దాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న వెంకటేశ్వరమ్మ మీదుగా దూసుకుపోయి, ఎడమవైపు పొలంలోకి ఒరిగిపోయింది. పిల్లలను బయటకు తీసిన తర్వాత బస్సు కింద ఉన్న వెంకటేశ్వరమ్మను గమనించిన స్థానికులు ఆమెను బయటకు తీసి ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్.కోట ఎస్సైలు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అచ్చు గుద్దినట్లు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారులు హర్షిత్ నాయుడు, హస్మిత్ నాయుడు. రాజాం మున్సిపాల్టీ పరిధి దోలపేట గ్రామానికి చెందిన సాకేటి శ్రీనివాసరావు, విశాలాక్షిలకు జన్మించిన వీరిది విచిత్ర బంధం. చిన్నతనం నుంచే అందరిలా అల్లరి చేష్టలతో కాకుండా ఒకరు తండ్రి మాట వింటే మరొకరు తల్లిమాట వినడం అలవాటు చేసుకున్నారు. ఆటపాటలు, చదువులు, సంప్రదాయాల్లో అందరికంటే భిన్నంగా ఉంటారు. వీరిద్దరు ఒక్కొక్కరుగా కనిపిస్తే గుర్తుపట్టడం చాలా కష్టం. ప్రస్తుతం వీరు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నారు.

- నేడు కవలల దినోత్సవం

రాజాం సిటీ: ఒకే రూపం..ఒకే ప్రవర్తన..ఒకే స్పందన కలిగి ఉండేది కవలలు అని చెప్పడంలో అతిశయోక్తి కాదు. మానవ జన్యు సంబంధమైన విశేషం వల్ల ఐదు పదినిమిషాల తేడాలో ఒకే తల్లి పేగుపంచుకుని పుట్టిన అన్నదమ్ములు కావచ్చు. అక్కాచెల్లెళ్లు కావచ్చు. ఒకే నడక, ఒకే తీరుతో కడదాకా బతుకు బండి కొనసాగించే సంఘటనలెన్నో. సినీ, క్రీడా, రాజకీయరంగం, సామాన్య కుటుంబాల్లో కూడా కవల పిల్లల జననం కొనసాగుతూనే ఉంది. ప్రతి గ్రామంలో కవలలు నిత్యం తారస పడుతూనే కనువిందు చేస్తుండడం గమనార్హం. అలాంటి పిల్లలకు రామలక్ష్మణులు, లవకుశలనో, లక్ష్మీసరస్వతులనో పేర్లు పెడుతుండడం సహజం. ఒకప్పుడు కవల పిల్లలు పుడితే ఒక వింత. నేడు ముగ్గురు, నలుగురు వరకు పుట్టే సంఘటనలు కూడా తారసపడుతున్నాయి. సమాజంలో కవలలకు ప్రత్యేక స్థానం ఉంది. శరీరాలు అతుక్కుని పుట్టిన వారు కొందరైతే ఒకే కాన్పులో నిమిషాల వ్యవధిలో జన్మించిన వారు మరికొందరు. వారు తమ జీవన శైలిలో కూడా ఇతరులకు భిన్నంగా ఉంటారు.

కవలల దినోత్సవం ఇలా..

మొదటి కవలల దినోత్సవాన్ని పోలెండ్ దేశస్తులు 1976లో జరుపుకున్నారు. మోజెజ్, ఆరన్ విల్‌కాక్స్ అనే కవల సోదరులు తాము ఉంటున్న ఊరికి ట్విన్స్‌బర్గ్ అని పేరుపెట్టారు. వింత వ్యాధితో బాధపడుతూ ఇద్దరూ ఒకేరోజు మరణించారు. వారి గౌరవార్థం 1976 నుంచి కవలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. భారతదేశంలో మొట్ట మొదటిసారిగా హైదరాబాద్‌లో 2004లో కవలల దినోత్సవాన్ని నిర్వహించారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹145	₹260	₹270